
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
మంగళవారం 12 మార్చి 2024



ప్రజావాణికి వినతుల వెల్లువ 6

మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించాలి





అడుగంటిన జలాలు

- ఎండుతున్న పంటలు
- మిడ్ మానేరు, అన్నపూర్ణలో డెడ్ స్టోరేజీ
- 10.18 మీటర్ల లోతులోకి పడిపోయిన జలాలు
- వరిపంటకు రైతుల నిప్పు
- పశువులకు మేతగా పొలాలు
- జిల్లాలో 1.73 లక్షల ఎకరాల్లో వరిసాగు
- బోరుబావుల రిపేర్లతో ప్రమాదాల్లో రైతులు
- జిల్లాలో యాసంగి ఆశలు ఆవిరి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో యాసంగిపై అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. పంటలకు నీటి వినియోగం పెరగడంతో బోరుబావులతో గంగమ్మను తోడేస్తున్నారు. మరోవైపు ఎండలు ముదిరిపోవడంతో భూగర్భ జలాలు నెమ్మదిగా పాతాళానికి చేరుతున్నాయి. దీంతో సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. చేతికొం దొస్తున్న పంటలు సాగు నీరం దక కళ్ల ముందే ఎండి పోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో మిడ్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టుల ద్వారా కాళేశ్వరం జలాలను చెరువులు, కుంటలు, బావుల్లోకి చేరి భూగర్భ జలాలు గట్టెక్కిస్తాయని రైతులు భావించారు. అనేక ఆశలతో యాసంగి పంటలు సాగు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మేడిగడ్డ వద్ద ఏర్పడిన అవాంతరంతో రాజన్న సిరిసిల్ల జిలా సాగునీటికి అవరోధం కలిగింది. ముదురుతున్న ఎండలకు జిల్లాలో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. జిల్లాలో వరిపొలాలు బీటలబారి రైతులను వెక్కిరిస్తున్నాయి. గత సంవత్సరం ఫిబ్రవరిలో 7.94 మీటర్ల లోతులో నీళ్ల లభిస్తే ప్రస్తుతం సరాసరి 10.18 మీటర్ల లోతులోకి పడిపోయాయి. వీర్నపల్లి మండలంలో 15.50 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోగా ఎల్లారెడ్డిపేటలో 15.02, ముస్తాబాద్‌లో 13.26, సిరిసిల్లలో 12.71, తంగళ్లపల్లిలో 10.71 మీటర్లకు చేరాయి. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో 27.55 టీఎంసీల నీటి మట్టానికి 11.84 టీఎంసీల నీటి మట్టానికి పడిపోయింది. ఉన్న కొద్దిపాటి నీళ్లను కూడా దిగువకు వదులుతున్నారు. ఇప్పటికే అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 3.5 టీఎంసీల సామర్థ్యానికి 0.9 టీఎంసీకి పడిపోయింది. జిల్లాలో ప్రధానంగా బోరుబావులపైనే ఆధారపడి పంటలు వేసుకున్నారు. జిల్లాలో 73,735 బోరు బావులు ఉన్నాయి. సిరిసిల్లలో 2243, కోనరావుపేటలో 7688, తంగళ్లపల్లిలో 8369, ఇల్లంతకుంట 9255, వేములవాడ 1058, వేములవాడ రూరల్ 701, బోయినపల్లి 6558, చందుర్తి 7793, ఎల్లారెడ్డిపేట 10854, ముస్తాబాద్ 7766. గంభీరావుపేటలో 6350 బోరు బావులు ఉన్నాయి. వీటి ద్వారా నీటి లభ్యత లభించకపోవడంతో రైతులు నీటి కోసం మరింత లోతుకు తవ్విస్తున్నారు. పూడికలు తీయి స్తున్నారు. బోరు బావులు పూడికలు తీసే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. కోనరావుపేట మండలం బావు సాయిపేటలో బోరు బావిలో పైపులను దింపుతూ నలుగురు రైతులు విద్యుదా ఘాతానికి గురయ్యారు. వారిలో పంబాల భూమయ్య అనే రైతు మృతిచెందాడు. సాగునీరు కోసం రైతులు అనేక అవస్థలకు గురవుతున్నారు.

జిల్లాలో భూగర్భ జలాలు తగ్గిన తీరు (మీటర్లలో)

మండలం	2023 (ఫిబ్రవరి)	2024 (ఫిబ్రవరి)	తగ్గుదల
బోయినపల్లి	6.35	6.57	- 0.22
చందుర్తి	4.83	7.01	- 2.18
గంభీరావుపేట	7.71	9.65	- 1.94
ఇల్లంతకుంట	6.18	7.85	- 1.67
కోనరావుపేట	7.74	9.87	- 2.14
ముస్తాబాద్	9.35	13.26	- 3.91
రుద్రంగి	4.60	7.53	- 2.93
సిరిసిల్ల	10.55	12.71	- 2.16
తంగళ్లపల్లి	6.91	10.71	- 3.80
వీర్నపల్లి	13.52	15.50	- 1.98
వేములవాడ రూరల్	7.04	5.37	1.68
వేములవాడ అర్బన్	13.59	13.58	0.01
ఎల్లారెడ్డిపేట	5.03	15.02	- 9.99
జిల్లా సరాసరి	7.94	10.18	- 2.24

● వేల ఎకరాల్లో ఎండిపోతున్న వరి

జిల్లాలో యాసంగిలో 1.76 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 1.73 లక్షల ఎకరాల్లో వరి వేశారు. తెగుళ్లతో ఆందోళన చెందుతున్న రైతులకు సాగునీరు లేక పంటలుఎండిపోతుండడంతో పశువుల మేతకు వదిలేస్తున్నారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో సోమవారం రైతులు పంటలు ఎండిపోవడం చూసి సాగునీరు ఇవ్వాలంటూ వరి చేన్లను తగులబెట్టారు. మరి కొందరు రైతులు నీళ్ల లేక ఎండుతున్న పొలాలను చూసి బాధపడుతూ అటు వైపు వెళ్లడం మానివేశారు. యాసంగిపై ఆశలు లేవని ఆందోళన చెందుతున్నారు. బోరుబావులు కొద్ది పాటి నీళ్ల ఉన్న రైతులు చివరి వరకు అందుతాయనే ఆశతో లేరు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.

జిల్లాలో వరి సాగు (ఎకరాల్లో)

మండలం	వరి
గంభీరావుపేట	17,318.04
ఇల్లంతకుంట	25,024.27
ముస్తాబాద్	19,903.28
సిరిసిల్ల	4783.13
తంగళ్లపల్లి	18,851.19
వీర్నపల్లి	6204.01
ఎల్లారెడ్డిపేట	16,512.32
బోయినపల్లి	13,079.12
చందుర్తి	15,182.01
కోనరావుపేట	17,141.03
రుద్రంగి	4112
వేములవాడ	5142.37
వేములవాడ రూరల్	10,487.11
మొత్తం	1,73,742.28



ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో వరికి నిప్పు పెట్టిన రైతులు

రంజాన్ పండుగకు సౌకర్యాలు కల్పించాలి

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):రంజాన్ పండుగ సందర్భంగా జిల్లాలోని మసీద్‌లు, ఈద్గాల వద్ద సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో మసీద్‌లు, ఈద్గాల వద్ద నిత్యం పారిశుధ్య పనులు చేయించాలన్నారు. తాగునీటి సరఫరా చేయాలని, నమాజ్ సమయంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని అన్నారు.సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్‌లు, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాధాబాయి, వేములవాడ డీఎస్పీనాగేంద్రచారి, డీసీఎస్‌వో జితేందర్‌రెడ్డి, ఓఎస్డీ సర్వర్‌మియా పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో మహిళా కవి సమ్మేళనం

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో మహిళా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సన్మానించారు. సమ్మేళనంలో సిరిసిల్లకు చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ రాణీప్రసాద్‌కు అరుదైన గౌరవం దక్కింది. 'మహిళా హృదయం' అనే కవిత ఆలోచింపజేసే విధంగా ఉందని ప్రశంసించారు.



కవిత వినిపిస్తున్న రాణీప్రసాద్

కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదుల గది ప్రారంభం

వేములవాడ టౌన్, మార్చి 11: వేములవాడ కోర్టులో మహిళా న్యాయవాదుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన గదిని సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, జూనియర్ సవిల్ జడ్జి జ్యోతిర్మయి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా న్యాయవాదులకు కోర్టులో ప్రత్యేక రూమ్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వేసవిలో కోర్టుకు వచ్చే కక్షిదారుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడంపై బార్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అధ్యక్షుడు రాజు, ఏజీపీ గుడిసే సదానందం, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, తిరుమల్ గౌడ్, పురుషోత్తం, కిషోర్‌రావు, పొత్తూరి అనిల్‌కుమార్, చర్ల ఆనంద్‌కుమార్, అంజయ్య, రజనీకాంత్, జనార్ధన్, సంపత్ మహిళ న్యాయవాదులు సంగీత, అన్నపూర్ణ, సుజాత, మమత, నయిమా నసీరా, లక్ష్మీప్రసన్న సుప్రియ ఉన్నారు.

ఇల్లంతకుంట ఎస్సైగా రాజుగౌడ్

ఇల్లంతకుంట, మార్చి 11:ఇల్లంతకుంట ఎస్సైగా లింగాల రాజుగౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైగా పనిచేసిన ప్రశాంత్‌రెడ్డి సెలవులపై వెళ్లగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నుంచి రాజుగౌడ్ బదిలీపై వచ్చారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

చందుర్తి, మార్చి 11 : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ బైరవని లావణ్య అధికారులకు సూచించారు. చందుర్తి మండలం బండపల్లి గౌడ సంఘంలో బోరు మోటార్‌ను ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిషత్ 15 ఫైనాన్స్ నిధులతో బోరు మోటారుకు లక్ష 30 వేలు కేటాయించినట్లు చెప్పారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వీర్నపల్లి, మార్చి 11: మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జడ్పీటీసీ గుగులోతు కళావతి సురేష్ నాయక్ అన్నారు. వీర్నపల్లి మండలం రంగంపేట పరిధిలోని భూక్యతండాలో జడ్పీ నిధుల ద్వారా తాగునీటి కోసం సోమవారం బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, మాజీ సర్పంచ్ లింగం, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్ పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి.. అవయవ దానం

బోయినపల్లి, మార్చి 11: బోయినపల్లి మండలం విలాసాగర్‌కు గంగాధర అంజయ్య (50) అనే ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందగా ఆయన అవయవాలను కుటుంబ సభ్యులు జీవన్‌ధాన్ ట్రస్ట్‌కు దానం చేసి నలుగురికి ప్రాణం పోశారు. విలాసాగర్‌కు చెందిన గంగాధర అంజయ్య సిరిసిల్లలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు, ఈ నెల 2న విలాసాగర్ నుంచి విధుల నిమిత్తం సిరిసిల్లకు వెళ్తుండగా వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అంజయ్య తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవయవాలను దానం చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించగా కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. అంజయ్య కిడ్నీ, లివర్, గుండె, ఊపిరితత్తులను దానం చేసి నలుగురికి ప్రాణం పోశారు. ఏఆర్ డీఎస్పీ గంగాధర్ నివాళులు అర్పించారు. అంజయ్యకు భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు ప్రియాంక, ప్రహర్ష ఉన్నారు.



అంజయ్య(ఫైల్)

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అప్పగింత

ఇల్లంతకుంట, మార్చి 11: మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన పయ్యావుల జనార్దన్ పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను సోమవారం ఎస్సై లింగాల రాజు అప్పగించారు. జనార్దన్ తన రూ.22వేల విలువైన మొబైల్‌ఫోన్‌ను గతనెలలో పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఆర్ సహాయంతో కనిపెట్టారు. ఫోన్‌ను గుర్తించడంలో కృషిచేసిన సిబ్బంది అనిల్, లక్ష్మీనారాయణను ఎస్సై అభినందించారు.

దుష్ప్రచారాలను నమ్మొద్దు

సిరిసిల్ల రూరల్, మార్చి 11:సోషల్ మీడియాలో చేనేత కార్మికులపై కొందరు పనికట్టుకొని చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని సిరిసిల్ల చేనేత జౌళి శాఖ ఏడీ మిట్టకోల సాగర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏటా చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలను కొనుగోలు చేయడంతోపాటు తయారీకి ఆర్డర్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో గతంలో కంటే ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు టెస్కోకి వచ్చిన ఆర్డర్ల ఆధారంగా చేనేత సంఘాల నుంచి తయారు చేసిన వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు తగిన గిరాకీ, గుర్తింపు లభించే విధంగా మరమగ్గాల ఉత్పత్తులను చేనేత ఉత్పత్తులతో కలవకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నేతన్న బీమా పథకాన్ని 18 నుంచి 59 సంవత్సరాల కార్మికులకు వర్తింపజేయనున్నట్లు పేర్కొన్నారు.



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఇల్లంతకుంట, మార్చి 11: వీరనారి చాకలి ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని సిరికొండలో సోమవారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించిన మహిళ ఐలమ్మ ఆన్నారు. ప్రతీ ఒక్కరి జీవితంలో సమస్యలు ఎదురవుతాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని ఐలమ్మ జీవితం చెబుతోందని అన్నారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ నీలం అంజయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ అయిలయ్య, రజక సంఘ జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేష్, శంకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఆత్మవిశ్వాసం కలిగించేందుకే ఫ్లాగ్ మార్చ్

సిరిసిల్ల క్రైం, మార్చి 11: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజల్లో ఆత్మవిశ్వాసం కల్పించేందుకు పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో సాయుధ దళాల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. టౌన్ సీఐ రఘుపతి, సాయుధ బలగాల సిబ్బంది, జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

ప్రత్యేక రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్

సిరిసిల్ల టౌన్, మార్చి 11 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో జడ్పీ చైర్ పర్సన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో నెలకొన్న సమస్యలను అధికారులు, వైద్యులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టాలని కోరారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, డాక్టర్ సంతోష్, అడ్మినిస్ట్రేషన్ అధికారి నాగభూషణం పాల్గొన్నారు.


'ఎలనాగ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- ఉమ్మడి జిల్లాకు దక్కిన మరో గుర్తింపు

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు మరోసారి ఉమ్మడి జిల్లాకు దక్కింది. కరీంనగర్ జిల్లా ఎలగందుల గ్రామానికి చెందిన కవి, రచయిత, అనువాదకుడు, విమర్శకుడు డాక్టర్ ఎలనాగ (నాగరాజు సురేందర్)కు ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అవార్డు అనువాద విభాగంలో గాలిబ్ నాటి కాలం పుస్తకానికి లభించింది. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి అనువాదంలో గత సంవత్సరం వారాల అనంద్, అంతకుముందు డాక్టర్ నలిమెల భాస్కర్ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను అందుకున్నారు. మరోసారి జిల్లాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడంపై కవులు, రచయితలు డాక్టర్ ఎలనాగకు అభినందనలు తెలిపారు. ఎలగందుల గ్రామానికి చెందిన ఎలనాగ 1953లో జన్మించారు. వృత్తిరీత్యా డాక్టర్‌గా సేవలు అందించారు. 1980 నుంచి 1986 వరకు నైజీరియాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేశారు. 1989 నుంచి 2012 వరకు ఆంధ్రప్రదేశ్‌వైద్య విధాన పరిషత్‌లో పనిచేసి రాష్ట్ర స్థాయి అధికారిగా పదవీ విరమణ పొందారు. కరీంనగర్ నుంచి వెలువడే గౌతమి పత్రికలో హైస్కూల్ నుంచే రచనలు చేయడం ప్రారంభించారు. మెడిసిన్ చదువుతుండగా భారతి, కృష్ణపత్రిక, స్రవంతితో పాటు వివిధ ప్రధాన పత్రికల్లో రచనలు చేశారు. 2005లో సోమర్సెట్ మామ్ రచన ది ఏలియన్ కార్న్ నవలను తెలుగులో కలుపు మొక్క పేరుతో అనువాదం చేశారు. 2009లో మొదటి కవితా సంపుటి వాగంకురాలు వెలువడింది, ఇదే సంవత్సరం గేయ సంపుటి పెన్నంటలు, కోయిలమ్మ పదాలు, 2010లో సజల నయనాల కోసం, మోర్నింగ్ మీద మాల్కౌస్ రాగం పద్యాల సంపుటి, 2012లో అంతర్‌లయ, అంతస్థాపమా, 2013లో ఉత్తమ లాటిన్ అమెరికన్ కథలు, పొరుగువెన్నెల అనువాద కవితలు, 2014లో ఉత్తమ ఆఫ్రికన్ కథలు, వట్టికోట అల్వార్ స్వామి కథలు, కాళోజీ నాగొడవ కవితలను ఆంగ్ల అనువాదం, ఇలా 37 పుస్తకాలను ప్రచురించారు. 2023లో ఊకీ యోటో వారి డాజ్‌లర్స్ వివిధ భాషల్లోకి అనువాదం చేశారు. డాక్టర్ ఎలనాగ ఇప్పటి వరకు ఓకియాటో పోయెట్ ఆఫ్‌ది అవార్డు, సోమ్‌సుందర్ పురస్కారం, అందెపల్లి పురస్కారం, జింక నాగరాజు పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, విశ్వసాహితీ పురస్కారం, అచార్య చెన్నకేశవరెడ్డి పురస్కారం, విడుగు రామ్మూర్తి పరస్కారాలను అందుకున్నారు.



డాక్టర్ ఎలనాగ



ఎంపికైన సంకలనం

క్రేన్ డబ్బా తెగి వ్యవసాయ కూలీ మృతి


రెడ్డి కుమారస్వామి మృతదేహం

భీమదేవరపల్లి, మార్చి 11: ప్రమాదవశాత్తు క్రేన్ డబ్బా తెగి ఓ వ్యవ సాయ రైతు కూలీ మృతి చెందాడు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో మారుపాక రాజమౌళి అనే రైతు వ్యవసాయ బావిలో రెడ్డి కుమారస్వామి (53) అనే రైతు పూడిక తీస్తున్నారు. క్రేన్ డబ్బాలో సోమవారం ఉదయం ఇద్దరు కూలీలు బావిలోకి దిగారు. రెడ్డి కుమారస్వామి కూడా బావిలోకి దిగేందుకు క్రేన్ డబ్బాలో బావిలోకి వెళ్తున్నాడు. క్రేన్ డబ్బా ప్రమాదవశాత్తు బావిలో పడి రెడ్డి కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారస్వామి భార్య రమాదేవి కళ్ల ముందే భర్త చనిపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి కుమారస్వామి ఐదేళ్ల క్రితం తన అత్తగారి ఊరు అయిన ముల్కనూర్‌కు జీవనోపాధికి వెళ్లాడు. అత్తగారి భూమితో పాటు మరొకరి వ్యవసాయ భూమి కౌలు తీసుకొని ఇతర కూలి పనులు చేసుకుంటూ కుమారస్వామి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య రమాదేవితో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

పశువుల అపహరణ : పోలీసులకు ఫిర్యాదు

తిమ్మాపూర్, మార్చి11: మండలంలోని మహత్మానగర్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పలు చోట్ల ఐదు పశువులను(ఆవులను) దొంగలించుకు వెళ్లారు. శ్రీ తాపాల నృసింహస్వామి దేవాలయములోని అర్చకులలైన వేంకటాద్రి స్వామి తను పెంచుకుంటున్న రెండు ఆవులను, స్థానికులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డికి చెందిన ఒక ఆవు, ఎడ్ల లక్ష్మారెడ్డికి చెందిన ఒక ఆవు మొత్తం నాలుగు పశువులను ఇండ్ల సమీపంలో కట్టేసి ఉండగా ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.


● వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి వద్ద మానేరు వాగు నుంచి ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.

నేటి నుంచే రంజాన్



(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దాన ధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో

ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్ని సార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్..! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.



జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..

ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

» సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు
» అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?
» పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం
» హార్డ్ డిస్కుల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు
» గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా
» ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?
» ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్లు స్విచ్చాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్కులను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్పగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్కులను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్కులను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్‌కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

» 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ
» 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ బైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక.. బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

» సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
» రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

సీఎం సార్... మా మొర ఆలకించండి!

» ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి
» సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న

అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, వేగంగా పూర్తి చేయాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం పలు అభివృద్ధి పనులను ఎంపీపీ రేణుకతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ పల్లెల ప్రగతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ వేణుగోపాలస్వామి ఆలయం, సీసీ రోడ్డు నిర్మాణాలకు రూ.12 లక్షల ఎంపీ నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్థానిక పద్మశాలి సేవా సంఘం, స్మశాన వాటిక అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల ప్రత్యేక నిధులను మంజూరు చేసిందన్నారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ అనసూయ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ రాజీనామా

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు ఆగయ్యకు సమర్పించినట్లు పేర్కొన్నారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్‌లో అంకితభావంతో పని చేసిన తనకు తగిన గుర్తింపు లభించలేదని స్పష్టం చేశారు. ఆత్మీయులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

'కదన భేరీ' సభ పోస్టర్ ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: కరీంనగర్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో కరీంనగర్ కదనబేరీ' బహిరంగ సభ పోస్టర్‌ను మండల కేంద్రంలోని కార్యాలయం ఆవరణలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు సోమవారం ఆవిష్కరించారు. ఎంపీపీ రేణుక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: మహిళలు, యువతులు, విద్యార్థినులకు రక్షణ కల్పించడం కోసమే షీ టీం పని చేస్తోందని జిల్లా షీ టీం ఏఎస్‌ఐ ప్రమీల అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం షీ టీంపై అవగాహన కల్పించారు. ఏవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే 8712656425 లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. హెచ్‌ఎం మధుమాలతి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ముస్తాబాద్, మార్చి 11: మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్‌మెంట్ పెంచిందన్నారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణి మృతి

గంభీరావుపేట, మార్చి 11: గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీలోకి వచ్చిన జింకను అధికారులు కరీంనగర్‌లోని ఎల్‌ఎండీ డ్యాం వద్ద ఉన్న జింకల పార్క్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సోమవారం అటవీ ప్రాంతంలో నుంచి గ్రామంలోకి వచ్చిన జింకను కుక్కలు వెంబడించడంతో ఓ ఇంట్లోకి చేరింది. గమనించిన స్థానికులు ఎస్సై రాంమోహన్‌కు సమాచారం అందించారు. కుక్కలు వెంబడించిన క్రమంలో జింకకు గాయాలైనట్లు గుర్తించిన ఎస్సై వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారి మంజుల జింకకు గాయమైన చోట ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం కరీంనగర్ తరలిస్తుండగా జింక మృతి చెందినట్లు, సిరిసిల్ల సమీపంలో పోస్టుమార్టం చేసి ఖననం చేశారు.

రుద్రంగి అభివృద్ధే ఎమ్మెల్యే ధ్యేయం

రుద్రంగి, మార్చి 11: రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్యేయమని డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

పదేళ్లలో ప్రజలకు ఏం చేశారు?

గంభీరావుపేట, మార్చి 11 : గడిచిన పదేళ్లలో మండలానికి మాజీ మంత్రి కేటీఆర్ ఏం చేశారో ప్రజలకు చెప్పాలని గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ చేసిన వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. నర్మాల ఎగువ మానేరు పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న మాటా ఏమైందన్నారు. పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్

సిరిసిల్ల రూరల్, మార్చి 11 : సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పెద్దూర్‌కు చెందిన సలేంద్రీ వేణుగోపాల్‌యాదవ్‌ను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు శ్రీరాముల వెంకటేశం సోమవారం నియామక పత్రాన్ని అందించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ మంగ కిరణ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిమల్ల భాను, చేనేత సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల సాగర్, 8వ వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, యువజన అధ్యక్షుడు శ్యాం, నాగరాజు అభినందించారు.

ఎస్టీ కార్పొరేషన్, టీఎస్ ప్రైడ్ నిధులు విడుదల చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 11:ఎస్టీ కార్పొరేషన్‌తోపాటు టీఎస్ ప్రైడ్ నిధులను విడుదల చేయాలని లంబాడీల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయక్ కోరారు. సోమవారం లంబాడీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు అదనపు కలెక్టర్ పూజారి గౌతమిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా నరేష్‌నాయక్ మాట్లాడుతూ ఎస్టీ కార్పొరేషన్, టీఎస్ ప్రైడ్ నిధులు విడుదల చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. గిరిజన నాయకులు నరహరి, మహేందర్, ప్రకాష్, శర్మన్ పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో గాయాలు

చందుర్తి, మార్చి 1 : చందుర్తి మండలం నర్సింగాపూర్ అటవీ ప్రాంతంలో సోమవారం కందకాల తవ్వకం పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలపై అడవి పందులు దాడి చేయగా ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇంటి వద్దకు చెరుకొని విశ్రాంతి తిసుకుంటున్నట్లు ఏపీవో పేర్కొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్‌లు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 11: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమ వారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూల నుంచి ప్రజలు తరలిరావడంతో కలెక్టరేట్ కిక్కిరిసిపోయింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ దరఖాస్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 50 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌లు మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధిత జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. లిఖితపూర్వకంగా సమాధానాలను అందించాలన్నారు.

వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల కోసం హెల్ప్‌డెస్కులు

జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ప్రధాన ద్వారం వద్ద వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల కోసం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయగా సోమవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజావాణికి వచ్చే వారికి సేవలను అందించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రమేష్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేస్తాం

ఇల్లంతకుంట, మార్చి 11: మండలంలోని పెద్దలింగాపూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న వారికి ఈనెల 13న పంపిణీ చేస్తామని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతులమీదుగా గృహ ప్రవేశాలు జరుగుతాయన్నారు.తహసీల్దార్ జావెద్ అహమ్మద్, ఆర్‌ఐ షఫీ, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, ప్యాక్స్‌డైరెక్టర్ గన్నారం వసంతనర్సయ్య పసుల బాలరాజ, సింగారెడ్డి పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: మహిళలు, యువతులు, విద్యార్థినులకు రక్షణ కల్పించడం కోసమే షీ టీం పని చేస్తోందని జిల్లా షీ టీం ఏఎస్‌ఐ ప్రమీల అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం షీ టీంపై అవగాహన కల్పించారు. ఏవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే 8712656425 లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. హెచ్‌ఎం మధుమాలతి, ఉపాధ్యాయులు మాలతి, రేవతి, షీ టీం కానిస్టేబుల్ ప్రియాంక, శ్రీధర్ పాల్గొన్నారు.

సాగు, తాగు నీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్, మార్చి 11 : వేసవిలో గ్రామాల్లో సాగు, తాగునీటి సౌకర్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముస్తాబాద్ మండల పరిషత్ అధ్యక్షుడు జనగామ శరత్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ జనగామ శరత్‌రావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, పంటలు ఎండిపోకుండా ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కరెంటు కోతలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో భాస్కర్‌శర్మ పాల్గొన్నారు.

ఆసాములకు ఉపాధి కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆసాములు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 11 : వస్త్ర పరిశ్రలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించి ఆసాములకు ఉపాధి కల్పించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సిరిసిల్ల రవీందర్, చేరాల అశోక్ డిమాండ్ చేశారు. వారం రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా నెలకొన్న సంక్షోభంతో ఆసాములకు ఉపాధిలేక కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసినా స్పందన లేకుండా పోయిందన్నారు. గత మూడు నెలల నుంచి ప్రభుత్వం, యాజమానుల నుంచి సహాయ సహకారాలు అందడం లేదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల రాజు, కారంపురి వైకుంఠం, కోడం రవీందర్, బూట్ల పరంధాములు, ఇప్పల్లపల్లి మురళి, ఒగ్గు శంకర్, అన్నల్‌దాస్ రాంప్రసాద్ తదితరులుపాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

తంగళ్లపల్లి, మార్చి 11: తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్, చిన్నలింగాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు జడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి భూమి పూజ చేశారు. సోమవారం అంకుసాపూర్ గ్రామంలో ఓపెన్ జిమ్ నిర్మాణానికి, చిన్న లింగాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ ప్రహరీ, డ్రైయినేజీ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ భైరినేని రాము, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, చుక్క రాజశేఖర్, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, మిరాల శ్రీనివాస్, హారిక రెడ్డి, సంద వేణి అంజయ్య, కంకణాల లక్ష్మణ్, బోటుకు రాజేశం, కోయడ నాంపల్లి, క్యారం నాగరాజు, వార్డు మెంబర్లు, పెంటల కనుకయ్య మల్లారెడ్డి, బైరి వెంక రెడ్డి, నర్సయ్య, శ్రీనివాసరెడ్డి, అంచ బాస్కర్ రెడ్డి, భూమయ్య సాయి రెడ్డి, భాను, ముత్తయ్య, సంజీవ్, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు

ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం వేములవాడలో దేవాదాయ శాఖ డీఈ రాజేశ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆలయ నిర్మాణ పనులను చేపట్టాలని గ్రామస్థులతో కూడిన సంతకాలతో తీర్మాణ పత్రాన్ని అందజేశారు. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తామని డీఈ రాజేశ్ హామీ ఇచ్చారని సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు కిషన్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రవీందర్‌గుప్తా, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వేములవాడ టౌన్, మార్చి 11: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎగమంఠ ఎల్లారెడ్డి, గురజాల శ్రీధర్, నర్సయ్య, మహేష్, చరణ్, అంజలి, గంగాజల, సింగారపు రాజు, లక్ష్మయ్య, గంగరాజు, సమన్ తదితరులు ఉన్నారు.

దళిత ప్రజాప్రతినిధుల అవమానం సరికాదు

చందుర్తి మార్చి 11: దళిత ప్రజాప్రతినిధులను అవమానించడం సరైనది వేములవాడ డివిజన్ అంబేద్కర్ సంగం అధ్యక్షుడు దుమ్ము ఆనంద్ అన్నారు. సోమవారం చందుర్తిలో విలేకరులతో మాట్లాడారు. అయోధ్యలో శ్రీరాముడి గుడిలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో రాష్ట్రపతిని మోదీ ప్రభుత్వం ఆహ్వానించకుండా అవమానించిందన్నారు. నేడు యాదాద్రిలో దళిత ఉప ముఖ్యమంత్రిని కింద కూర్చోబెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవమానించిందన్నారు.

జీరో బిల్లుపై ఆందోళన వద్దు

గంభీరావుపేట, మార్చి 11: గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందొద్దని సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, సెస్ ఏఈ రుషిక తెలిపారు. 200 యూనిట్ల లోపు రీడింగ్ తిరిగినా జీరో బిల్లు రాకపోతే వెంటనే మండల పరిషత్‌లోని ప్రజాపాలన విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేసీఆర్ కదన భేరీకి కదిలిరండి



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ టౌన్, మార్చి 11: కరీంనగర్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ కదన భేరీకి వేల సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఎస్ మైదానంలో కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. వేములవాడ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కదలిరావాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ బలం, బలగం చూపే సమయం ఆసన్నమైందని, ఢిల్లీలో గళం వినిపించాలంటే పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కరీంనగర్ బహిరంగ సభకు ప్రతీ మండలం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలి వస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ సింగ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, అన్ని మండలాల అధ్యక్షులు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వెయ్యి మంది తరలిరావాలి

కరీంనగర్‌లో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభకు వేములవాడ అర్బన్ మండలం నుంచి వెయ్యి మందిని తరలించాలని జడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. వేములవాడ మండలం నందికమాన్ వద్ద విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌లో నిర్వహించే సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని అన్నారు. సమావేశంలో ఆర్సీరావు, రాసూరి రాజేశం, మారవేని మల్లేశం, భూమల్ల లక్ష్మణ్, గుర్రం లక్ష్మారెడ్డి, రెడ్డవేని పర్శరాములు, జింక శ్రీధర్, పెరుగు పర్శరాములు యాదవ్ ఉన్నారు.

మహిళలే సమాజానికి మణిహారాలు



చైర్ పర్సన్‌కు కేక్ తినిపిస్తున్న మహిళా కౌన్సిలర్లు

సిరిసిల్ల టౌన్, మార్చి 11 : మహిళలే సమాజానికి మణిహారాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం సినారె కళామందిరంలో మున్సిపల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం మహిళా పాలక వర్గం సభ్యులు, మున్సిపల్ మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రతీ ఇంట్లో మహిళలు పరిస్థితులను చక్కదిద్దుకుంటూ కుటుంబాన్ని నడిపించడంలో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ హర్షణీయం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

సిరిసిల్ల రూరల్, మార్చి 11 : ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను నియమిస్తామని ఉద్యోగులు, ఉపాధ్యాయులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రామానాథ్‌రెడ్డి అన్నారు. సిరిసిల్లలోని శివనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై సీఎం సానుకూల దృక్పథం ప్రదర్శించడం సంతోషమన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

వేములవాడ టౌన్, మార్చి 11: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఓ యువకుడు బాలికను కిడ్నాప్ చేసి ఓ గది అద్దెకు తీసుకొని అత్యాచారానికి పాల్పడ్డాడు.. టౌన్ సీఐ కరుణాకర్ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా భీమారం మండలానికి చెందిన ఫైదం సాయికుమార్ (23)అనే యువకుడు ఓ బాలికను కిడ్నాప్ చేశాడు. ఆదివారం వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ గది అద్దెకు తీసుకొని నిర్బంధించాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడడంతో బాలికకు తీవ్ర రక్తస్రావం జరిగింది. సాయికుమార్ ఆ బాలికను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో సాయికుమార్‌పై కిడ్నాప్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉపాధి కూలి పెంచాలి

కోనరావుపేట, మార్చి 11: ఉపాధి కూలీలకు 600 రూపాయల వరకు కూలి పెంచాలని సీపీఎం మండల అధ్యక్షురాలు జవ్వాజి విమల డిమాండ్ చేశారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో సోమవారం ఉపాధిహామీ కూలీలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. పని భారం ఎక్కువ పడుతోందన్నారు. పనికి తగ్గ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంల ఇళ్ల డబ్బులు ఇప్పించండి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 11: గంభీరావుపేల మండలం గోర్యంటాలలో నిర్మించుకున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించిన బిల్లును ఇప్పించాలని లబ్ధిదారులు సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన 30 మందికి గత ప్రభుత్వం 2022లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేసిందన్నారు. నిర్మాణాలు పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు బిల్లు చెల్లించలేదన్నారు. లబ్ధిదారులు సీహెచ్ లావణ్య, విజయ, లక్ష్మీ, బాలమణి, దేవవ్వ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న అభిలాష్

రుద్రంగి, మార్చి 11 రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని పదోతరగతి విద్యార్థినులకు ఆది శ్రీనివాస్ యువసేన ఆధ్వర్యంలో మాడిశెట్టి అభిలాష్ సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో వనిత, ఎర్రం ఆరవింద్, పూదరి మహిపాల్, గట్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు మొండి చేయి

గంభీరావుపేటట, మార్చి 11: ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు మొండి చేయి చూపిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్ ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్‌పై ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. గంభీరావుపేట అభివృద్ధిపై చర్చకు కేటీఆర్ పిలవడం కాదని, తామే పిలుస్తున్నామని అన్నారు. మండలానికి ఎవరూ ఏం చేశారో? ప్రజల మధ్య చర్చకు ఎప్పుడైన సిద్ధమేనన్నారు. మరోసారి బండి సంజయ్‌ను విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. నాయకులు రాజిరెడ్డి, పర్శాగౌడ్, రమేష్, విగ్నేష్, నాగరాజు, రాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ సిద్దోగం వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించారు. మంగళవారం రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సంఘం సభ్యులు తెలిపారు.

మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించాలి



సిరిసిల్లలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు, నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 11: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన సంక్షోభంతో ఉపాధి కోల్పోయిన ఆసాములు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో సోమవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులు, ఆసాములు రాస్తారోకో చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో టౌన్ సీఐ రఘుపతి వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కూరపాటి రమేష్ మాట్లాడుతూ రెండు నెలలనుంచి ప్రభుత్వ వస్త్ర ఆర్డర్‌లను ఇవ్వకపోవడంతో మరమగ్గాలతోపాటు వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన వారందరికి ఉపాధి లేకుండా పోయిందన్నారు. డిప్యూటీ సీఎం, చేనేత జౌళిశాఖ మంత్రి, సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందించకపోవడం అన్యాయమన్నారు. కార్మికులు, నాయకులను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ మాట్లాడుతూ మార్చి 14న కార్మికులతో 24 గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, అన్నల్‌దాస్ గణేష్, తంగళ్లపల్లి మండల ఆసాముల సంఘం అధ్యక్షుడు గోనే పర్శరాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల టౌన్, మార్చి 11: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంప్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో సిబ్బందికి గ్రామ వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్‌ఐ ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న చలో హైదరాబాద్‌లో భాగంగా పంచాయతీరాజ్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడిం చనున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా నాయకులు అన్నల్‌దాస్ గణేష్, లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య, శ్రీనివాస్, నర్సయ్యతదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి భవన నిర్మాణ పనులు కొనసాగించాలి



మంత్రిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 11: సిరిసిల్ల పద్మశాలీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని, తిరిగి కొనసాగే విధంగా చూడాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిరిసిల్ల పద్మశాలీ సంఘం నాయకులు కోరారు. ఆదివారం రాత్రి కరీంనగర్‌లో సిరిసిల్ల పద్మశాలీ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా మంత్రిని కలసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు ఫైనాన్స్ అప్రువల్ ఇవ్వకపోవడంతో పనులు నిలిపివేసినట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ఫైనాన్సియల్ అప్రూవల్ శాఖ ద్వారా విచారణ జరిపి అప్రూవల్‌ను ఇప్పించడానికి ప్రయత్నిస్తానని హామీ నిచ్చారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పద్మశాలి సంఘం నాయకులు సన్మానించారు. మంత్రిని కలసిన వారిలో సిరిసిల్ల పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మండల సత్యం, కోశాధికారి కోడం శ్రీనివాస్, మహిళ పట్టణ అధ్యక్షురాలు కాముని వనిత, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్కా మదు, నాయకులు వెంకటేశం, దూడం శ్రీనివాస్, కోడం అమర్, బూట్ల మోహన్, కాముని నళినీకాంత్ ఉన్నారు.